
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి



ఇసుక తవ్వకాలను ఆపాలని వినతి


హౌసింగ్ ఇఇకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలో గోదావరికి ఆనుకుని పేదల ఆధీనంలో ఉన్న ఏనుగువానిలంక ఇసుకలంక భూముల నుంచి ఇసుక తరలింపును ఆపాలని కోరుతూ చించినాడ గ్రామస్తులు మంగళవారం నరసాపురం సబ్ కలెక్టర్, హౌసింగ్ ఇఇలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండలు, కేతా రాము, చెల్లుబోయిన వడ్డికాసులు, సెట్టిమి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వికృత క్రీడకు విలవిల..!

యథేచ్ఛగా పండుగ మూడు రోజులు కోడి పందేలు

రెండు జిల్లాల్లో రూ.వందల కోట్లు బెట్టింగ్

ఆర్థికంగా దెబ్బతిన్న సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం


కోర్టులను ఏమార్చేందుకు పోలీసుల సరికొత్త ఎత్తుగడ

పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు ఇచ్చేందుకు రంగం సిద్ధం

ప్రభుత్వ తీరుపై సర్వత్రా విస్మయం

'పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ మండలానికి చెందిన రైతు పొలం పెట్టుబడికి అని రూ.50 వేలు అప్పుతెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఊరువాడా కోడిపందేలు జరగడంతో చూసేందుకు వెళ్లిన సదరు రైతు ఆకర్షితుడై పందేలు కాశాడు. పెట్టుబడికి తెచ్చిన డబ్బంతా పందేల్లో పోవడంతో.. ఇంటికి వెళ్లలేక దిక్కుతోచని పరిస్థితిలో మానసికంగా కుంగిపోయాడు.'

'ఏలూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దాళ్వా నాట్లు పనులకు వెళ్లి కుటుంబమంతా కష్టపడిన కూలి పని సొమ్మును పండుగ ఖర్చులకు అని దాచుకున్నాడు. కుమార్తెలు, అల్లుళ్లను పండుగకు పిలిచాడు. పండుగ అయిపోయి వెళ్లేటప్పుడు బట్టలు పెట్టాలనుకున్నాడు. అయితే కోడిపందేల్లో ఉన్న సొమ్మంతా పోవడంతో ఏం చేయాలో తెలీని పరిస్థితి నెలకొంది. విషయం తెలిసి ఆ కుటుంబమంతా తీవ్ర వేదనలో మునిగిపోయింది.'



పైనపేర్కొన్న ఇద్దరే కాదు.. రెండు జిల్లాల్లోనూ వేలాది కుటుంబాలు వికృత క్రీడ కోడిపందేలకు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. మరోసారి కోడి పందేలకు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకమే బలిపశువులుగా మారిన పరిస్థితి నెలకొంది. సంప్రదాయం ముసుగులో జరుగుతున్న కోడి పందేలకు ప్రతియేటా ఎన్నో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నా ప్రభుత్వాలకు, అధికారులకు పట్టడం లేదు. కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఆగని పరిస్థితి నెలకొంది. పందేలను అడ్డుకుంటామని భోగిపండుగ ముందురోజు వరకూ బీరాలు పలుకుతున్న పోలీసులు పండుగ మూడురోజులు మాత్రం పత్తాలేకుండా పోతున్నారు. ప్రభుత్వ అనధికార ఆదేశాలతో కోడిపందేలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ 47 మండలాలు ఉండగా ప్రతి మండలంలోనూ పది బరులకు తక్కువ కాకుండా కోడి పందేలు జరిగిన పరిస్థితి ఉంది. దాదాపు 470 బరుల్లో కోడి పందేలు సాగినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లో దాదాపు రూ.200 కోట్లకుపైగా బెట్టింగుల రూపంలో చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. కోడిపందేల బరుల వద్ద గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. ఎంఎల్ఎలే దగ్గరుండి కోడిపందేలు నిర్వహించిన పరిస్థితి నెలకొంది. తమ గ్రామాల్లోనే కోడిపందేలు జరుగుతుండటంతో చూసేందుకు వెళ్లిన ఎంతోమంది సామాన్య ప్రజానీకం జేబులు గుల్ల చేసుకున్న పరిస్థితి ఏర్పడింది. ఎంతోమంది చిరుద్యోగులు, రైతులు, కూలీలు, కార్మికులు ఇలా ఎన్నో కుటుంబాలు కోడిపందేలతో ఆర్థికంగా కుదేలైన పరిస్థితి నెలకొంది. పిల్లల ఫీజులకు అని తెచ్చిన డబ్బు, ఆసుపత్రి ఖర్చులకు దాచుకున్న సొమ్ము, పొలం పెట్టుబడుల కోసం తెచ్చుకున్న డబ్బుతోసహా పోగొట్టుకుని ఎంతోమంది రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడింది. బైండోవర్ కేసులు, బరుల ధ్వంసం పేరుతో హడావుడి చేసిన పోలీసులు పండుగ మూడు రోజులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. రాత్రీ పగలు తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పందేలు సాగాయి. బరుల ప్రాంతాలన్నీ జాతరను తలపించాయి. వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. అయినప్పటికీ పందేలను అడ్డుకున్న నాథుడు లేకుండాపోయాడు. రాజకీయంగా లాభం చేకూరుతుందని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలే పందేలను ప్రోత్సహిస్తూ సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్నారు. మంగళవారం పందేలు ఆగినప్పటికీ మూడు రోజులు సాగిన పందేలతో ఎంతోమంది జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. వికృత జూద క్రీడకు చిన్న, పెద్ద తేడా లేకుండా ఆకర్షితులై వ్యసనపరులుగా మారుతున్నారు.

కోర్టులను ఏమార్చేందుకు ఎత్తుగడలు..!

పండుగ మూడు రోజులు కోడి పందేలకు అడ్డుకట్ట వేయకుండా పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. కోర్టులను ఏమార్చేందుకు మాత్రం ఇప్పుడు రెండు జిల్లాల్లోనూ పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తొలిరోజు కోడిపందేలతోపాటు గుండాట, పేకాట, మూడు ముక్కలాటకు సైతం అనుమతిచ్చేశారు. రెండో రోజు గుండాట, పేకాటను అడ్డుకోవాలంటూ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అయితే అప్పటికే గుండాట, పేకాట నిర్వాహకులు మామూళ్లు ఇవ్వడంతో వారిని అడ్డుకోలేదు. దీంతో గుండాట, పేకాటకు సంబంధించిన ఫొటోలతో మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తొలిరోజు కాకుండా మిగిలిన రెండు రోజులు గుండాట, పేకాట వంటి వాటిని అడ్డుకోలేదనే కారణంతో పలువురు సిఐలు, ఎస్ఐలకు ఛార్జిమెమోలు జారీ చేయనున్నట్లు తెలిసింది. బుధవారం రెండు జిల్లాల్లోనూ ఎంతమందికి ఛార్జిమెమోలు ఇచ్చేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పందేలను అడ్డుకోకపోగా ఈ విధంగా ఛార్జిమెమోల పేరుతో హడావుడి చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ తీరుపైనా చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రక్తహీనత తలెత్తకుండా శ్రద్ధ వహించాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

బడి ఈడు పిల్లల్లో రక్తహీనత సమస్యలు తలెత్తకుండా వైద్యఆరోగ్య శాఖ మరింత శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నిర్దేశించిన ఎనిమిది స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించి మాట్లాడారు. బడిఈడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో రక్తహీనతకు గురికాకుండా ఎప్పటికప్పుడు వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు, సంబంధిత మందులను రోజుకు రెండుసార్లు చొప్పున అందజేసేలా చూడాలన్నారు. ఒకసారి గర్భం దాల్చిన మహిళ రక్తహీనతకు గురై చికిత్స అనంతరం, రెండో కాన్పుకు కూడా ఇదే పరిస్థితి ఎందుకు తలెత్తుతుందని వైద్య శాఖాధికారులను నిలదీశారు. 0-5 అంగన్వాడీ పిల్లలకు, 10-19 ఏళ్ల పాఠశాల విద్యార్థులకు, కౌమారదశ బాలికలకు, 15-49 వయస్సు మధ్యగల ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి వారికి సరైన ఆహారం, వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో ఒక్కరు కూడా రక్తహీనతకు గురైన వారు ఉండటానికి వీల్లేదని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు బయట ఉండకూడదన్నారు. ఎవరైనా ఈ వయసు పిల్లలను బడికి పంపకుండా అడ్డు పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 1,864 పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి వసతి అందుబాటులో ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలపై డిఆర్‌డిఎ ఎపిఎంలు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్‌వి.రమణ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి వి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

19 నుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ


ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోషరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం

2023-24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్)పై ఈ నెల 19వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) వారు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోషరావు తెలిపారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఇఆర్‌సికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదికలపై ఈ నెల 19, 20, 21 తేదీల్లో విశాఖపట్నంలోని తమ కార్పొరేట్ కార్యాలయంలో రోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని తెలిపారు. ఎపిఇఆర్‌సి ప్రతిరోజూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను విశాఖపట్నం నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అభిప్రాయాలు చెప్పదలుచుకున్నవారు ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఎస్ఇ, లేదా ఇఇ ఆఫీస్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ ముందుగానే నమోదు చేసుకున్నవారి అభ్యంతరాలు, సలహాలు తెలిపిన తర్వాత, ఎపిఇఆర్‌సి అనుమతితో నమోదు చేసుకోనివారి అభిప్రాయాలు కూడా తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

భూములిచ్చిన ప్రతిరైతుకూ తగిన న్యాయం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు హామీ


మాట్లాడుతున్న ముదునూరి ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - నరసాపురం

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములిచ్చిన ప్రతి రైతుకూ తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం నరసాపురం మండలం వైఎస్ పాలెం పంచాయతీ పితానివానిమెరక రైతుభరోసా కేంద్రం వద్ద రాజుల్లంక, లక్ష్మణేశ్వరం, వైఎస్-పాలెం, సీతారాంపురం ప్రాంతాల్లో 9.7 కిలోమీటర్ల పరిధిలో భూములు ఇచ్చిన రైతులతో ప్రసాద్‌రాజుతోపాటు జాయింట్ కలెక్టర్ జెవి.మురళి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు మాట్లాడుతూ మన ప్రాంత అభివృద్ధిలో రైతులంతా భాగస్వాములు కావాలని, మీ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. నిబంధనల మేరకు పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. భూములిచ్చిన రైతుల భూమి వివరాలను పరిశీలించి ప్రభుత్వ ధరకు రెండున్నర రెట్లు ఎక్కువిచ్చేలా కృషి చేస్తానన్నారు. లక్ష్మణేశ్వరంలో ఇప్పటికే కొన్ని స్థలాల్లో ఇళ్ల నిర్మాణం, కొబ్బరి మొక్కలు ఉన్న విషయాన్ని రైతులు చెప్పారు. వారికి ఇళ్ల స్థలాలు, కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందజేయడానికి పరిశీలిస్తామని ప్రసాద్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ దస్తావేజులు, అగ్రిమెంట్లు కొన్ని భూములకు లేవని, వారికీ న్యాయం చేయాలని రైతులు కోరారు. భూరికార్డులను పరిశీలించి వాస్తవ భూమి వివరాలను తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ప్రసాద్‌రాజు కోరారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, నాలుగు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

డివైఎఫ్ఐ క్రీడోత్సవాల ముగింపు సభలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ



మాట్లాడుతున్న సాబ్జీ

ప్రజాశక్తి - ఆకివీడు

క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, ఇది తగదని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకొచ్చాక విస్మరించారని అన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి యువజనోత్సవాల ముగింపు సభ మంగళవారం రాత్రి స్థానిక జెడ్‌పి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం నియోజకవర్గానికి ఒక క్రీడా మైదానాన్ని నిర్మిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. రాష్ట్రంతోపాటు దేశంలో కూడా క్రీడలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. 186 దేశాల్లో భారతదేశం వందో స్థానంలో ఉండటం దురదృష్టకరమన్నారు. యువత నైపుణ్యం పూర్తిగా వెనుకబడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానంలో మార్పు కోసం సామాజిక, విద్యార్థి సంఘాలు అందరూ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కరణం మల్లేశ్వరి తర్వాత ఆస్థాయిలో చెప్పుకోదగ్గ క్రీడాకారులు ఎవరూ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆంధ్రుల ప్రత్యేక క్రీడ కబడ్డీ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందినా అక్కడి వరకూ మన క్రీడాకారులు వెళ్లలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయులను నియమించి క్రీడలను ప్రోత్సహించాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్రాంతి సమయంలో సాంప్రదాయం పేరుతో జూద క్రీడలను ప్రజాప్రతినిధులు వెనుక నుండి ప్రోత్సహించడం మన దౌర్భాగ్యమన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ విపరీతంగా పెరిగిపోయాయని, విద్యార్థులను, యువతను ఈ డ్రగ్స్ నుంచి కాపాడడానికి తాము ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. క్రీడా బడ్జెట్ పెంచి క్రీడాకారులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్టేడియంల ప్రయివేటీకరణ తగదన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, క్రీడోత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ, కోశాధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు జ్యోతిబసు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం - ఘనంగా జ్యోతిబసు 12వ వర్ధంతి


జ్యోతిబసుకు నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

దేశ రాజకీయాల్లో సిపిఎం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ప్రధాన పాత్ర పోషించారని. ఆయన అందరికీ స్ఫూర్తిదాయకులు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనం వద్ద కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకులు, సిపిఎం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 12వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత బలరాం జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ విద్యార్థి దశనుండే జ్యోతిబసు స్వాతంత్రోద్యమంలో భాగస్వాములై జైలుకెళ్లారన్నారు. బెంగాల్‌లో రైల్వే, జ్యూట్ కార్మికులను సమీకరించి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని సంఘటిత పర్చి ఉద్యమాన్ని నడపడంలో సిపిఎం నాయకునిగా ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఎనిమిదిసార్లు ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారని, 25 ఏళ్ల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా పని చేసి సిపిఎం, వామపక్ష సంఘటన ఆధ్వర్యంలో ఆదర్శవంత పాలనను జ్యోతిబసు అందించారన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల్ని కాపాడటంలో జ్యోతిబసు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కుల్ని హరిస్తోందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధులివ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. బిజెపి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా అంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మల్లిపూడి ఆంజనేయులు, రమణ, లత పాల్గొన్నారు.

తణుకురూరల్: జ్యోతిబసు నేటి తరానికి స్ఫూర్తిదాయకులని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు కొనియాడారు. ఆ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబసు 12వ వర్ధంతిని వేల్పూరులోని స్థానిక ప్రజాసంఘాల భవనంలో నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, చోరపల్లి రామకృష్ణ, విశ్వనాథం సుబ్బారావు, వాసా పోసియ్య, దున్నే రుద్రనాగేశ్వరరావు, రుద్రాక్షుల శ్రీను, మారిన చినగణేష్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: జ్యోతిబసు 12వ వర్ధంతిని మంగళవారం బ్రాహ్మణచెరువులో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు మాట్లాడగా నేతలు కోడి శ్రీనివాస్ ప్రసాద్, మల్లెల తులసిరావు, బొక్కా ప్రకాశం, చిన్నారి పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో జాతీయస్థాయిలో మూడో స్థానం


వీరవాసరం విద్యార్థిని ఘనత


గాయత్రిని అభినందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వీరవాసరం

జాతీయ స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో వీరవాసరం ఎస్ఎంబిటిఎవి అండ్ ఎస్ఎన్ కళాశాల విద్యార్థిని కవురు గాయత్రి మూడోస్థానం సాధించింది. ఈ మేరకు మంగళవారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ (బాబ్జి), ప్రిన్సిపల్ వలవల నరసింహారావు క్రీడాకారిణిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని కళాశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం గాయత్రిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కళాశాలలో బిఎస్‌సి మూడో సంవత్సరం చదువుతున్న గాయత్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున మహారాష్ట్ర కొల్లాపూర్ శివాజీ యూనివర్సిటీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఈ ఘనత సాధించింది. ఆమెను అభినందించిన వారిలో సంయుక్త కార్యదర్శి వర్ధినీడి నాగవెంకట రవికుమార్, ఫిజికల్ డైరక్టర్ చింతా సతీష్, అధ్యాపకులు దుర్గాప్రసాద్ ఉన్నారు.

రీసర్వే ద్వారా పలు ఉపయోగాలు : ఇన్‌ఛార్జి డిఆర్ఒ రాజు


రీసర్వే ను ప్రారంభిస్తున్న దాసి రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న భూముల రీసర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు అన్నారు. కుముదవల్లిలో మంగళవారం రీసర్వేలో భాగంగా మండలానికి సంబంధించిన డ్రోన్ ఫ్లయింగ్ రీసర్వేను గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజుతో కలిసి దాసి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎక్కడా లేనటువంటి విధంగా భూసమస్యల పరిష్కారానికి జగనన్న భూహక్కు పథకంలో భాగంగా రీసర్వే చేపట్టిందన్నారు. భీమవరం డివిజన్‌లో ఈ సర్వే సమగ్రంగా సాగుతుందని, డ్రోన్ ఫ్లయింగ్ సర్వే కుముదవల్లి గ్రామంలో ప్రారంభించామని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో రీసర్వే ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామస్తులు ఈ రీసర్వేను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ రాంబాబు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ శివకృష్ణ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ నాగభూషణరావు, విఆర్ఒ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు


తలపడుతున్న జట్లు

ప్రజాశక్తి - నరసాపురం

యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కవురు పెద్దిరాజు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేములదీవిలో జరుగుతున్న నరసాపురం నియోజకవర్గ స్థాయి ఆటలపోటీలు మంగళవారం మూడోరోజు జరిగాయి. వాలీబాల్ ఫైనల్ పోటీలో మొగల్తూరు జట్టుపై రుస్తుంబాద జట్టు గెలుపొంది ప్రథమస్థానంలో నిలిచింది. మొగల్తూరు జట్టు ద్వితీయస్థానం, వేములదీవి జట్టు తృతీయ స్థానంలో నిలిచి ఆయా బహుమతులు గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మండలస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ పోటీలకు కోటిపల్లి కన్నబాబు రిఫరీగా వ్యవహరించారు. కవురు రాజేష్, పూదిండి దుర్గాప్రసాద్, తుమ్మా దుర్గాప్రసాద్, మామిడిశెట్టి మోహన్, కవురు బాబి, బొక్కా గుణ నాగ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్‌లో పూడికతీత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గాంధీ బొమ్మ కూడలి సమీపంలో ఉన్న డ్రెయిన్‌లో పూడికను మంగళవారం తీశారు. మొగల్తూరులో క్షీణించిన పారిశుధ్యం శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి జి.జయరాజు స్పందించారు. ఈ మేరకు డ్రెయిన్‌లో పూడిక తొలగించి మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకున్నారు.

జగనన్న ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం శివారు విస్సాకోడేరు వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను ఆ పార్టీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, నేతలు సికిలే పుష్పకుమారి, యేలేటి విజయానంద్‌తో కలిసి పరిశీలించారు. జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారులను కలిసి ఇళ్ల నిర్మాణంలో వారెదుర్కొంటున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో సరైన రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల్లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిమెంట్, ఇసుక, స్టీల్ వంటి భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలనీల్లో రోడ్లు నిర్మించాలని, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు ఎన్‌టిఆర్ వర్ధంతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 18వ తేదీన నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సభ మండలంలో నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి(బుల్లా) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9:30 గంటలకు ఓడూరులో తారక రామారావు విగ్రహానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం మార్టేరులోని లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపంలో ఉదయం పది గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాలకొల్లు : జనవరి 18వ తేదీ బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు జీవీ తెలిపారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం ఉచిత సైకిళ్ల పంపిణీ, యలమంచిలి కళ్యాణమండపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

టిడిపి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉండి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు (పొందువ్వ) రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుంచి నారా కుటుంబం ఫొటోలను ఉపయోగించి ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంఎల్‌సి సత్యనారాయణరాజు మాట్లాడుతూ నారా చంద్రబాబు కుటుంబంతో తనకున్న అనుబంధంతో ప్రతి సంవత్సరంలోనూ వారి కుటుంబం ఫొటోతో ఆకర్షణీయంగా క్యాలెండర్‌ను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం ఉండి టిడిపి నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు.

బిసి మహాసభ ఆచంట కన్వీనర్‌గా కుమారస్వామి

ప్రజాశక్తి - ఆచంట

బిసిల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయడమే జాతీయ బిసి మహాసభ ముఖ్య ఉద్దేశమని బిసి మహాసభ జిల్లా అధ్యక్షులు అల్లాడి సూర్య భాస్కరరావు అన్నారు. జాతీయ బిసి మహాసభ ఆచంట కన్వీనర్ల కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్‌గా తాళ్ల కుమారస్వామి యువజన కన్వీనర్‌గా ముప్పన సుబ్రహ్మణ్యంలను నియమించి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సూర్య భాస్కరరావు మాట్లాడుతూ అర్హత కలిగిన బిసిలకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి మహాసభ నాయకులు పాల్గొన్నారు.

బిసిలకు 50శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

ప్రజాశక్తి - పాలకొల్లు

చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని బిసి కులాలు సమిష్టిగా పోరాడాలని పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం నిర్వహించిన పాలకొల్లు నియోజకవర్గ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పలువురు కోరారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాల గణేష్, భవానియాదవ్, ఇతర సంఘ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర జనార్ధన బోను దుర్గానరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేస్తున్నవారిని అభినందించారు. దీనికోసం అన్ని కులాలు సమిష్టిగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కొడె యుగంధర్, వివిధ ఆలయాల చైర్మన్లు కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, గొర్లె సత్యనారాయణ, కడలి ధర్మారావు, పింజరపు శంకర్, మాధవి, భాస్కర మాధవ, కొండేటి శివకుమారిగౌడ్, కొండేటి మల్లికార్జునరావు, మామిడి సత్యనారాయణ, చల్ల సాంబయ్య, గొర్ల శ్రీనివాస్, కట్టా వెంకటరావు, కృష్ణ, బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు గంటా వెంకన్న, తలుపూరి భుజంగరావు పాల్గొన్నారు.

పెనుమంట్రలో నేడు 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్రలో ఈ నెల 18వ తేదీ బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచి తాడిపర్తి ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. బోర్డ్ సభ్యులు, వైసిపి నాయకులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

దేశ సంస్కృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు



తాడేపల్లిగూడెంలో...



పాలకోడేరులో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్రాంతి పురస్కరించుకుని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తాడేపల్లిగూడెం పట్టణం స్థానిక భాగ్యలక్ష్మీపేట 19వ వార్డులో మిఠాయి సూర్యారావు వీధిలో మహిళలకు ముగ్గులు పోటీలు, పిల్లలకు స్లోసైకిల్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన విజేతలకు మొదటి, రెండో, మూడో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, బిసి సంక్షేమ రాష్ట్ర నాయకులు వర్తనపల్లి కాశీవిశ్వేశరావు, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, డివైఎఫ్ఐ నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీనివాసులు మాట్లాడుతూ యువత పేకాట, జూదం, కోడిపందేలు, అశ్లీల చిత్రాల వైపు వెళ్లకుండా ఉండేందుకు డివైఎఫ్ఐ, సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీలు పెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జువ్వాది శ్రీను, పోతు శ్రీను, శేషుబాబు, శ్రీను, రాజు, చిటికిన రాము, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మీపేట మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలంలోని జగన్నాధపురంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జగన్నాధపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాల నుంచి అనేక ప్రాంతాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ అలాంటి సంస్కృతిని స్థాపించారని, ఆ సంస్కృతిని నేటి తరం నాయకులు కొనసాగించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో గాడ ప్రసన్న, రెండో స్థానంలో వి.సంధ్య, మూడో స్థానంలో ఎన్.సింధు నిలిచారు. బాలికల కుర్చీలాటలో కె.శ్రావణి ప్రథమ స్థానం, మద్ది కీర్తన రెండో స్థానం, రన్నింగ్ సీనియర్‌లో ప్రథమ స్థానం ఆర్.సాయిచందు, రెండో స్థానం యు.విజయ, జూనియర్స్ రన్నింగ్‌లో నిత్యజీవరాజు ప్రథమ స్థానం, నమ్మి బాలు రెండో స్థానం, బాలికల స్లో సైకిల్‌లో ఆర్.సాయి సంధ్య ప్రథమ స్థానం, యు.విజయ రెండో స్థానం, బాలికల సీనియర్స్ రన్నింగ్ పోటీలో జానీ జ్యోతి, పీల జషిత, జూనియర్స్ రన్నింగ్‌లో ముకుందా, హర్షవర్ధన మొదటి, రెండు స్థానాలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పీల గాది నాయుడు, పక్కుర్తి మాణిక్యాలరావు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకోడేరు : దేశ సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రజాసంఘాల నాయకులు షేక్ వలి, శేషాపు అసరియ అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పాలకోడేరు, కొమడవల్లి, పెన్నాడ గొరగనుమడి గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీ, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు పాలకోడేరు మాజీ సర్పంచి గాదిరాజు చంద్రావతి కుమారుడు గాదరాజు రాంబాబు, మాజీ సర్పంచి ఆళ్ల అప్పలరాజు, ఎస్ఐ రామచంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయులు రాంభద్రరాజు, భారతి ఆర్థిక సహకారంతో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత పెడదారిన పట్టకుండా క్రీడలను ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల నుంచి ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తోట పద్మ, మహిళా సంఘం నాయకులు దున్న మరియమ్మ, దుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.



మొగల్తూరు : సంక్రాంతి సందర్భంగా కెపి.పాలెంనార్త్ ఇందిరమ్మ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కెపి.పాలెం సౌత్ సర్పంచి అందే వెంకటలక్ష్మి దొరబాబు, అంబేద్కర్ పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షులు కట్టా వేణుగోపాలకృష్ణ, వైసిపి కెపి.పాలెంనార్త్ గ్రామ ప్రెసిడెంట్ ముచ్చల చుక్కలాచార్యులు, కెపి.పాలెం సౌత్ మాజీ సర్పంచి గోడి శారదాంబ, ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, సభ్యులు యడ్ల చిట్టిబాబు, ముచ్చల రాజారావు, మెట్టి సువర్ణరాజు, మిట్టి ప్రసాద్, మెట్టి సురేష్, మెట్టి బాలయేసు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఆకివీడు : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో స్థానికంగా గత మూడు రోజులుగా పోటీలు నిర్వహించారు. కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతిని దుంపగడప టీం గెలుచుకోగా ఆకివీడుకు చెందిన నాటుగుంటల యూత్ రెండో బహుమతి గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో జరిగిన పాటల పోటీల్లో మొదటి బహుమతి కనుమూరి ప్రసాద్, రెండో బహుమతి నెల్లి బాల ఆదిత్య సాధించారు. అదే వేదికపై జరిగిన జిల్లా స్థాయి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి భవాని, రెండో బహుమతి ఎస్.శృతి గెలుచుకున్నారు. రెండు విభాగాలుగా జరిగిన చదరంగం పోటీల్లో సీనియర్ టీంలో ఏలూరుకు చెందిన వై.మహేష్ ప్రథమ బహుమతి గెలుచుకోగా రెండో బహుమతి ఆకివీడుకు చెందిన కె.వర్మ గెలుచుకున్నారు. జూనియర్స్ టీంలో ఏలూరుకు చెందిన అవరహం అభిషేక్ మొదటి బహుమతి, ఏలూరుకు చెందిన ప్రేమరక్షత్ రెండో బహుమతి గెలుచుకున్నారు. ముగ్గుల పోటీలు సీనియర్స్ విభాగంలో ఎస్.సౌజన్య, డి.హేమ ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో వై.గౌతమి, పి.దేవయాని వరుసగా మొదటి, రెండో బహుమతులు గెలుచుకున్నారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో పి.తనుశ్రీ, కె.గౌరీ ప్రియ, జూనియర్స్ విభాగంలో ఒ.హరిని బహుమతి గెలుచుకున్నారు.

ఉండి : ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సాంస్కృతిక పోటీలను ప్రోత్సహించాలని ఉండి మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు, పిల్లలకు ముగ్గుల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి మండల అధ్యక్షుడు, అర్తమూరు, కలిసిపూడి గ్రామాల సంయుక్త ఎంపిటిసి సభ్యులు డి.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు జడ్జిలుగా డాక్టర్ ఎన్.డెబోరా మెస్సియానా, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ గాదిరాజు సూర్యకుమారి, మంతెన రమాదేవి వ్యవహరించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.మూడు వేల విలువైన వెండి, రూ.మూడు వేల నగదు అందించారు. రెండో బహుమతిగా రూ.రెండు వేల విలువైన వెండి, రూ.రెండు వేల నగదు అందించారు. మూడో బహుమతిగా రూ.వెయ్యి విలువైన వెండి, రూ.వెయ్యి నగదు అందించినట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు, గ్రామస్తులు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న పనులను అభినందిస్తూ అధ్యక్షులు రామలింగేశ్వరరావును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పోటీదారులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం



తలపడుతున్న జట్లు

నరసాపురం పట్టణంలోని గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. స్త్రీ, పురుషుల విభాగంలో మొత్తం 25 జట్లు తలపడుతున్నాయి. మూడో రోజు పలు పోటీలు ఉత్కంఠంగా సాగాయి. మహిళా విభాగంలో తెలంగాణ ఢిల్లీ జట్ల మధ్య జరిగిన పోటీ నువ్వా-నేనా అన్న రీతిలో జరిగింది. చివరికి నాలుగు పాయింట్ల తేడాతో తెలంగాణ విజయం సాధించింది. పురుషుల విభాగంలో రాజస్థాన్-వెస్ట్ బెంగాల్ మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. చివరికి మూడు పాయింట్ల తేడాతో బెంగాల్ విజయం సాధించింది. పోటీలను తిలకించేందుకు క్రీడా ప్రేక్షకులు పెద్దఎత్తున స్టేడియం వద్దకు తరలివచ్చారు. ఈ నెల 18న ఫైనల్స్ జరగనున్నాయి. విజేతలకు రూ.ఐదు లక్షలు ప్రైజ్‌మనీ అందించనున్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ, పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకిరామ్, ఎఎంసి మాజీ చైర్మన్ దొండపాటి స్వామి, కబడ్డీ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి నాగార్జున క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు.

కోరుకొల్లులో శత గీత గుళికల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పాలకోడేరు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ వైద్యులు వర్మ

కోరుకొల్లు గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత మంతెన అచ్యుతరామరాజు రచించిన శత గీత రసగుళికల పుస్తకావిష్కరణ మంగళవారం కోరుకొల్లులో నిర్వహించారు. భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యులు పిఆర్‌కె.వర్మ ఆవిష్కరించారు. ఈ పుస్తకావిష్కరణలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కోరుకొల్లు గ్రామంతో పాటు చుట్టుపక్క ప్రాంత ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రచయిత అచుత్య రామరాజు వంద గీతాలు రచించి ప్రథమ ముద్రణ చేసి ప్రముఖుల చేత ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. కెమికల్ ఇంజినీర్‌గా బయాలజికల్ ఇఎల్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేసిన అచ్యుతరామరాజు రచయితగా రచనలు చేయడం ఆయన గొప్పతనమన్నారు. రచయిత అచ్యుత రామరాజు మాట్లాడుతూ ఈ శత గీత రసగుళికలు పుస్తకం తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు మంతెన నరసింహరాజు, లీలవతమ్మకు అంకితం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమనికి వ్యాఖ్యాతగా సినీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ వ్యవహరించగా గ్రామ సర్పంచి మంతెన భారతి, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి డైరెక్టర్ మంతెన యోగేంద్రకుమార్ (బాబు), ఉప సర్పంచి చంటి రాజు, పెనుమత్స సీతారామరాజు, మాజీ సర్పంచి మంతెన లక్ష్మీనరసింహరాజు, నారాయణరాజు, మంతెన శ్రీనివాస్, సుందర్, పెనుమత్స గీత, మ్యూజిక్ డైరెక్టర్ నరైన్, ప్రముఖ సినీ గాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పాలిలో పలు పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - అత్తిలి

ఈ నెల 18న పాలిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ వివిఎస్.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆరవల్లిలో వేమన జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈయనతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి కొడాలి నాని హాజరుకానున్నారని పేర్కొన్నారు.

'ఎస్‌సిల అభ్యున్నతికి జగన్ కృషి'

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశంలో 29.8 లక్షల ఎస్‌సి కుటుంబాలకు రుణాలు ఇస్తే ఒక్క ఎపిలోనే 29.2 లక్షల కుటుంబాలకు రుణాలిచ్చినట్లు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల ఎస్‌సిలకు జనాభా బట్టి నిధులు ఇస్తుంటే ఆంధ్ర రాష్ట్రంలో జగన్ మాత్రం వారి పేదరికం బట్టి అన్ని విధాలుగా సహాయం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సిలకు నిధులు ఇవ్వడం లేదని కొందరు హైకోర్టుకు వెళ్లారని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లెక్కలను చూసి వారు సిగ్గు పడాలని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎస్‌సిల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని, జగన్ నిజాయితీగా నిధులు ఎక్కువ ఇచ్చి వారి పేదరికం పోవడానికి సహాయపడుతున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఎస్‌సిలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వలేదని, ఆఖరికి ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న తెలంగాణ కూడా ఎస్‌సిలకు ఇన్ని నిధులు ఇవ్వలేదని చెప్పారు. ఈ సమావేశంలో గంటా నరేష్, పాలపర్తి కృపనాధ్, తెన్నేటి స్యామ్యూల్, బెజ్జవరపు నాగరాజు, పెచ్చెట్టి కృష్ణాజి, తలుపూరి భుజంగారావు, అప్పాజీ పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

భీమవరం శాఖ, డి.నెం.2-1-39, రామ్స్ ప్లాజా, జె.పి. రోడ్డు, భీమవరం - 534202.
ఫోన్ నెం.08816-222540, 224124/125, ఇ-మెయిల్ : iob1091@iob.in

స్వాధీనతా ప్రకటన

[స్థిరాస్తి కొరకు - అనుబంధం IV - రూల్8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ హామీదారులు : శ్రీమతి నల్లా విజయ లక్ష్మి, భర్త : శ్రీ నల్లా వెంకట శ్రీరామమూర్తి**, డి.నెం.27-17-55/1/ఇ-1, సత్యం హోమ్స్, ఎయస్ఆర్ నగర్, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, (ఇకపై 'ఋణగ్రహీతలు'గా సూచిస్తారు) మరియు **శ్రీ నల్లా వెంకట శ్రీరామమూర్తి, తండ్రి** : ఎన్. పుత్రసత్యం, డి.నెం.27-17-55/1/ఇ-1, సత్యం హోమ్స్, ఎయస్ఆర్ నగర్, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా (హామీదారు) వారు మొత్తం బకాయిపడిన సొమ్ము **ది.19-01-2022 నాటికి రూ.73,88,879/- (అక్షరాల డెబ్బై మూడు లక్షల ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మాత్రము) మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారము తదుపరి జమకూడు వడ్డీ, ఛార్జీలు మొ॥నవి** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.19-01-2022న డిమాండు నోటీసు జారీచేయడమైనది.**

(1) ఋణగ్రహీత/ హామీదారులు బకాయిసొమ్ము చెల్లించడంలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.12-01-2023న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీసు ఇచ్చి తెలియజేయడమైనది.

(2) సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటిలావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **ది.19-01-2022 నాటికి బకాయిసొమ్ము మొత్తం రూ.73,88,879/- మరియు కాంట్రాక్ట్యువల్ రేటుప్రకారము తదుపరి జమకూడు వడ్డీ మరియు అంగీకరించిన రెస్ట్స్, ఛార్జీలు మరియు డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన తేదీ తరువాత జరిపిన చెల్లింపులు మినహాయించగా స్వాధీనత తేది నాటికి చెల్లించవలసిన బకాయిసొమ్ము రూ.72,84,387/- మరియు కాంట్రాక్ట్యువల్ రేటుప్రకారము తదుపరి జమకూడు వడ్డీ మరియు రెస్ట్స్, ఛార్జీలు మొ॥నవి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** వారి ఛార్జికి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా **ఋణగ్రహీతకు** మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమైనది.

(3) సదరు చట్టంలోని సబ్ సెక్షన్ (8) ఆఫ్ సెక్షన్ 13 యొక్క నిబంధనలు ప్రకారం గడువు సమయంలోపు పూర్తి బకాయిలు చెల్లించి ఋణగ్రహీతలు సెక్యూరిటీలను తిరిగి పొందే వీలును గమనించవలసినదిగా కోరుచున్నాము.

స్థిరాస్తుల యొక్క వివరములు

(శ్రీమతి నల్లా విజయ లక్ష్మి పేరున గల ఆస్తి)

ఐటమ్ నెం.1 : (ముమ్మిడివరం యస్ఆర్ఓలోని తేది.17.04.2012 నాటి దస్తావేజు నెం.1669/2012 క్రింద ఆస్తి)

తూర్పు గోదావరి జిల్లా, ముమ్మిడివరం యస్ఆర్ఓ, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామం & గ్రామ పంచాయతి వద్దగల ఆర్.యస్.నెం.1014లోని ఎ.4.54 సెంట్ల విస్తీర్ణము గల ఫిష్ ట్యాంక్స్ యొక్క యావదాస్థి. **దీనికి హద్దులు : తూర్పు** : సత్తి లక్ష్మి మరియు ఇతరులకు చెందిన భూమి, **పడమర** : ఆర్‌యస్ నెం.1007లోని భూమి, **ఉత్తరం** : సత్తి గంగిరెడ్డికి చెందిన భూమి, **దక్షిణం** : ఎన్. విజయలక్ష్మికి చెందిన భూమి.

ఐటమ్ నెం.2 : (శ్రీమతి నల్లా విజయ లక్ష్మి పేరున గల ఆస్తి) (ముమ్మిడివరం యస్ఆర్ఓలోని తేది.17.04.2012 నాటి దస్తావేజు నెం.1670/2012 క్రింద ఆస్తి)

తూర్పు గోదావరి జిల్లా, ముమ్మిడివరం యస్ఆర్ఓ, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామం వద్దగల సర్వే నెం.1007/1లో ఎ.0.03సెంట్లు, సర్వే నెం.1007/2లో ఎ.0.58 సెంట్లు మొత్తం నెం.107/1 మరియు 107/2లోని ఎ.0.62 సెంట్ల విస్తీర్ణము గల ఫిష్ ట్యాంక్స్ యొక్క యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు** : మద్దాల సుబ్బారావు యొక్క భూమి, **పడమర** : ఆర్‌యస్ నెం.1008లోని భూమి, **ఉత్తరం** : ఆర్‌యస్ నెం.1006లోని భూమి, **దక్షిణం** : ఆర్‌యస్ నెం.1007/3లోని భూమి.

ఐటమ్ నెం.3 : (శ్రీమతి నల్లా విజయ లక్ష్మి పేరున గల ఆస్తి) (ముమ్మిడివరం యస్ఆర్ఓలోని తేది.22.06.2012 నాటి దస్తావేజు నెం.2321/2012 క్రింద ఆస్తి)

తూర్పు గోదావరి జిల్లా, ముమ్మిడివరం యస్ఆర్ఓ, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామం & గ్రామ పంచాయతి వద్దగల ఆర్.యస్.నెం.1007/3లోని ఎ.4.89 సెంట్ల విస్తీర్ణము గల ఫిష్ ట్యాంక్స్ యొక్క యావదాస్థి. **దీనికి హద్దులు : తూర్పు** : ఆర్.యస్. నెం.1014లోని అర్జీదారు యొక్క భూమి, **పడమర** : సాధనాల భాస్కర రావు యొక్క భూమి మొ॥, **ఉత్తరం** : ఆర్.యస్.నెం.1007/1, 2లోని అర్జీదారు యొక్క భూమి, **దక్షిణం** : ఆర్‌యస్ నెం. 1007/3లోని ఎన్‌వియస్ఆర్ మూర్తి యొక్క చెందిన భూమి.

మొత్తం 3 ఐటమ్‌ల లోని ఎ.10.04 సెంట్ల ఆస్తి.

ప్రదేశం : భీమవరం
తేది : 12-01-2023

సం/- అధీకృత అధికారి
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, మొగల్తూరు విద్యుత్ శాఖ ఎఇ ఎం.శివప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళీపట్నం సబ్‌స్టేషన్ పరిధి కొత్తపేట, కాళీపట్నం, పాతపాడు, జగన్నాధపురం, కోమటితిప్ప, ముత్యాలపల్లి, మోడీ గ్రామాల్లో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఎండగండి గ్రామంలో పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. నడి వీధిలో పూరి గడిసెలో నెల రోజులపాటు గ్రామస్తుల సేవలు అందుకున్న పోలేరమ్మను మంగళవారం వేలాది మంది గ్రామస్తులు మంగళవాయిద్యాలు, గరగ నృత్యాలతో బాణసంచా కాల్చుతూ ఉత్సాహంగా పెద్ద వాహనంపై నైవేద్యాలు పెట్టి రాయపేటలో ఉన్న అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయాన్నే అమ్మవారికి పరగంగ ద్వారా చలి నైవేద్యాన్ని పంపించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంట అమ్మవారి నైవేద్యాలు పెట్టారు. గతేడాది రూ.కోట్ల వ్యయంతో మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించిన తర్వాత ప్రప్రథమంగా జరుగుతున్న అమ్మవారి జాతర మహోత్సవాలు తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జనవరి 22న ఎండగండిలో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాధరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్న సమారాధన కూడా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : నందలూరు

O.S.No. 84/2022

బొబ్బె సుభాషిణి, W/o బొబ్బె రామచంద్రయ్య, ఈదరపల్లి (గ్రా॥), నందలూరు (మం॥), అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

మల్లిపూడి ప్రభాకర్‌రావు, S/o ఎమ్.సోమయ్య, వయస్సు 45, లక్ష్మణేశ్వరం గ్రామం, నరసాపురం (మం॥), వెస్ట్ గోదావరి జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పై నెం. దావాలో వాది బొబ్బె సుభాషిణి, W/o బొబ్బె రామచంద్రయ్య, వయస్సు 40, డోర్‌నెం.2/231, ఈదరపల్లె గ్రామము, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా, మల్లిపూడి ప్రభాకర్‌రావు అయిన నీపై నీ నుండి నీవు రాసిన ప్రోనోట్ బాకీ వసూలు నిమిత్తము నీపై నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు దావా వేసి వున్నారు. కనుక నీవు 20.1.2023 తేదీన 10.30 ని॥ నందలూరు కోర్టు నందు హాజరు కావాలి అట్లు లేనిచో నీకు వ్యతిరేకంగా తీర్మానించబడును.

//By Order of the Court//
N.HARIBABU,
Advocate,
Nandalur.

ప్రకటన

In The Court Of The 1st Additional Junior Civil Judge : Tanuku
E.P.No. 62/2022 in O.S.No. 548/2019

Plaintiffs /DHR's:
Kotichukkala Anjaneyulu (Died)
Kotichukkala Seetha and others

Defendants /JDR:
Anupoju Veeracharyulu, S/o. Nageswara Rao, Gold Shop, D.No. 4-74, Gollagudem Vari Street, Penugonda, Penugonda Mandal, TNK J.C.J.C.

పై నెంబరు ఇ.పి.లో మీరు (జె.డి.ఆర్) Order 21 Rule 54 and Rule 66 Notice తీసుకొనకుండా Evade చేయుచున్నందున **ది.20-01-2023 తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు కాని ఎడల పరోక్షమందు తీర్మానించబడును.**

Tanuku, 10-1-23.
D.RADHA
Advocate,
Tanuku, W.G.Dist.